# జీవిత వేదిక

నాకు ఇంటికి రావాలంటేనే విసుగా ఉంటుంది. మా ఇంట్లో అశాంతి తాండవమాడుతూంటుంది. ఆపరేషన్ అంటే భయమంటూ మా అమ్మా నాన ఎడాపెడా కనిపారేసిన సంతానంలో నేను మధ్యవాడిని. నా తర్వాత ఇంకా ఇద్దరు తమ్ముళ్ళు.

అన్నయ్యకూ, నాకూ బొటాబొటీ జీతపురాళ్ళు తెచ్చుకొనే ప్రైవేటు ఉద్యోగాలు. కట్నం కోసం తగుదునమ్మా అంటూ అన్నయ్యకు పెళ్ళి వేసేశారు 'పెద్దలు' అనబడటానికి అర్హత లేనివాళ్ళు.

ఈ వాలీవాలని సంసారంలోకి వచ్చింది వదిన. పాపం! ఎన్నో ఆశలతో అడుగుపెట్టిన కొత్త పెళ్ళికూతురు, నిలువునా ఊబిలోకి దిగిపోయింది. వదినా వాళ్ళ నాన్న బతకలేని నూటపదహార్ల ఉద్యోగి, పైగా అయిదుగురు ఆడపిల్లల తండ్రి. వదినకు ఆమె తండ్రి ఎలాగూ ఇంతకంటే గొప్ప సంబంధం దొరుకుతుందనీ, తేగలడనీ చెప్పగల సందర్భం, సత్తా లేవు.

ఈ చేదు నిజాన్ని పుట్టింట్లోనే వదిన ఎప్పుడో జీర్ణించుకుని గట్టిపడిన వ్యక్తిత్వంతో మా ఇంటి కోడలుగా అడుగుపెడ్తున్నదనే అనుకున్నాం. కాని అది పేరాసేనని అర్థమయింది.

పుట్టినప్పటినుండీ ఎన్నో 'నిరాశల దొంతర' లను పేర్చుకుంటూనే వచ్చాం. ఇప్పుడు ఇంకొక నిరాశల పొర అదనంగా వచ్చి చేరింది. అంతే తేడా! వదిన 'కొత్త చీరకొనలేద'నో ఏదో ఒక సాకుతో చిటపటలాడ్తూ, రోజుకి రెండుసార్లైనా ఏడుస్తూ, తన నొసటిరాతను నిందించుకుంటూంటుంది.

ఏదో పోగొట్టుకున్నట్లు అమ్మ దీనంగా, జబ్బుతో అడపాదడపా మంచం ఎక్కుతూ ఉంటుంది. నాన్న జన్మించినదాదిగా తానేమో గొప్ప లక్షాధికారి అయినట్లూ, ప్రస్తుతం పీడిస్తున్న దారిద్ర్యానికి 'పుట్టిన పిల్లలం మేము కారణమైనట్లూ' మమ్మల్ని తిడుతూ మా మీద కోపాన్ని రౌద్రాన్ని ప్రదర్శిస్తూ ఉంటాడు. (చిన్నవాళ్ళం మేము నోరుజారితే పచ్చిగా ఉంటుందిగానీ నాన్న మలకమంచాన్ని కూడా పందిరి మంచం సాటిగా పావనం చేయగలిగిన ఘనత వహించిన నిముషాలను గుర్తుంచుకోవలసిన అవసరం ఆయనకి ఏ మాత్రం లేదా?)

కట్నం కానుకలు చాలలేదనీ, సైకిల్ తెమ్మనీ, ముక్కుపుడక చేయించుకురమ్మనీ, బాలసారెనాడు కూతురుకు ఉంగరం చేయించాలనీ ఏదో ఒక సాకుతో అక్కయ్యను రెండు నెలలకొకసారి బావగారు, వాళ్ళ అత్తగారు వెళ్ళగొడ్తూంటారు. అక్కయ్యకు నా దగ్గర చనువు ఎక్కువ.

"తమ్ముడూ! నా బ్రతుకింతే! నేను మీకు భారమౌతున్నాను. ఈ మేనకోడలి భారం అంతా నీదే!" అంటూ నా దగ్గర బావురుమంటూంటుంది.

తప్పేదేముంది గనుక! నేను, అన్నయ్య తలతాకట్టుపెట్టి, బావగారి గొంతెమ్మ కోర్కెలను తీర్చి ఎలాగో అక్కయ్యను అత్తవారింటికి పంపిస్తూఉంటాము.

చిన్నక్క 'లవ్ మారేజీ' చేసుకుని వెళ్ళిపోయింది. "ఆమెది కులాంతర వివాహము"ని మేమందరమూ చిన్నక్కను గడప తొక్కనీయలేదు. కానీ ఆచరణలో చిన్నక్క చేసిన పనే సబబుగా తోస్తున్నది. చిన్నక్క చిన్నబావగారూ ఇద్దరూ ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగాలు చేస్తూ, ఉన్నంతలో హాయిగానే కాలక్షేపం చేస్తున్నారు.

నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని, బయటపడ్డాను. ఆదివారం సెలవురోజే యినా ఆ ఇంటిలో నాకు ఉండబుద్ధికాదు. ఇంటికంటే గుడిపదిలం! నేనెప్పుడూ ఏ పార్కులోనో, గుళ్ళోనో పొద్దైనంతవరకూ కాలక్షేపం చేస్తాను. కాని అక్కడ కూడా నా మనసులో కందిరీగల్లా, ఇంటి సమస్యలే ముట్టు ముడ్తూంటాయి. అక్కడ కూడా నాకు ఆట్టే మనశ్శాంతి లభించదు. ఫలితంగా 'పార్కు' షార్కుచేపలా, 'గుడి' సుడిగుండంలా మారిపోతుంటాయి నా ప్రాణానికి.

★ ★ ★ ★ ★ ★

కాని ఇవాళ పార్కుకు హుషారుగానే బయలుదేరాను. వకుళమాల వచ్చింది మరి! వకుళ మా ఆఫీసులోనే టైపిస్టు. మా పరిచయం ప్రేమలోకి దూకే శుభసూచనలు కనిపిస్తున్నాయి.

మా తలిదండ్రులు నా వివాహానికిససేమిరా పూనుకోరు. నేను సంపాదించే జీతపురాళ్ళకు ఇంకొక భాగస్వామి వస్తే సహించగలరా? నా తమ్ముళ్ళ చదువు, చెల్లెలి పెళ్ళి నా భుజస్కంధాలపై "ఈ రాక్షసులు ఉరఫ్ విధీ" మోపిన పెను బాధ్యతలు!

"మీ అక్కయ్య పెళ్ళి నా కట్నంతో చేశాం!" (ఉట్టిదే! ఆ కట్నం అన్నయ్య పెళ్ళికీ పదహార్రోజుల పండగనాటికే హుష్ కాకీ అయిపోయింది. కానీ వదిన భ్రమను రూపుమాపగల బలమైన సాధనోపాయాలు మా దగ్గర లేవు) "నీకు చదువు చెప్పించాం! ఇంక తక్కినవాళ్ళ బాధ్యతను నువ్వు చూస్కోవలసిందే!" అంటూరుసరుసలాడ్తుంది వదిన.

నిజమే! ఆమె గుర్తు చేయకపోయినప్పటికీ, ఇవి నన్ను కలలో కూడా వెంటాడే బాధ్యతలే!

ఇంట్లో వాళ్ళెవ్వరికీ నా వివాహ బాధ్యత పట్టదు, పైగా అడ్డుపుల్ల వేస్తారు కూడా! ముప్ఫై ఏళ్ళ ముదురు బ్రహ్మచారిని నేను మాత్రం ఎంతకని ఓర్చుకోగలను?

"నాకూ నాదైన చిన్న సంసారం కావాలి, ఈ విశ్వవిపంచిలో ఒక రాగంగా, ప్రపంచ జీవనస్ర

పి. కుసుమకుమారి

వంతిలో ఒక చిరుతరగగా నా జీవన పయనం సాగాలనీ నాకు ఆశ ఉండటం తప్పంటారా?''

మీరే చెప్పండి!!

అందుకే వకుళమాలతో పరిచయం మహాభాగ్యంగా భావించాను. ఇవాళ ఆమెతో పెళ్ళి ప్రస్తావన కూడా తీసుకురాబోతున్నాను.

★ ★ ★ ★ ★ ★

వకుళ చెప్పిన వివరాలను బట్టి వాళ్ళ సంసారం కూడా మా గృహసామ్రాజ్యానికి సమతూకంగా ఉంది. వకుళమాలది గంపెడు సంసారం, తండ్రి రిటైరైన బడిపంతులు. ఈ మధ్యనే ఈ ఊరు చేరారు. అన్నదమ్ములూ అక్కచెల్లెళ్ళూ అందరూ ఊరికే కూర్చోరు. ఎవరికి చేతనైనది వాళ్ళు సంపాదిస్తారు.

తర్వాత ఒక మంచిరోజు చూసి, వకుళ వాళ్ళ ఇంటికి నన్ను తీసుకెళ్ళి, పరిచయం చేసింది.

వకుళ తండ్రి చిన్నప్పుడు అయిదోక్లాసు వరకూ నాకు టీచరు పాఠాలు చాలా బాగా చెప్పేవారు. మాకు ట్యూషన్ చెప్పడం పూర్తవగానే ఆయన సలహాలు తీసుకోవడానికి చాలామంది వేచి ఉండేవారు. అందరి సమస్యలను తాపీగా విని, తనకు తోచిన సలహాను సందర్భోచితంగా ఇచ్చేవారు ఆయన అలాటి మాస్టారుగారి కుమార్తెను ''నా అర్ధాంగిగా చేసుకోబోతున్నా''ననే ఆలోచన నన్ను తబ్బిబ్బు చేసింది.

మాస్టారు రిటైరైనాక, కొంచెం సన్నబడ్డారు, తల నెరిసింది. అంతే! వయసు తెచ్చిన శారీరక మార్పు మాత్రం కొంచెం కనిపిస్తున్నది. కాని మాస్టారి ముఖంలో అదే ప్రశాంతత, అదే చెరగని చిరునవ్వు. అదే ధీరత్వ చిహ్నం. అవి చాలు, మాస్టారిని ఎక్కడున్నా గుర్తుపట్టడానికి. వకుళమాలలో కూడా ఈ చిరునవ్వే గొప్ప ఆరక్షణ! తండ్రి నుండి వారసత్వంగా పుచ్చుకున్న ఈ గొప్ప ఆభరణం చాలు, వకుళను నా భార్యగా చిరకాలం గర్వంగా నిలుపుకోవడానికి.

మాస్టారుగారు, మాస్టారి భార్య నన్ను ఆప్యాయంగా పలకరించారు. వారి అయిదుగురు పిల్లలు స్నేహశీలురే!


''ఒక్కళ్ళే చాలు! సంతానం! అనే ఈరోజులతో పోల్చుకోకు, నాయనా! మాకు పెళ్ళయ్యే నాటికి ఈ వాక్యం ప్రచారంలో లేదు. మాకు తెలివి వచ్చేసరికి, అయిదుగురు యుగకర్తలు ఉద్భవించారు'' ఎలాటి విషయమైనా-ఆయన సున్నిత హాస్యంలో ఓలలాడి తీరుతుంది.

మాస్టారుకూ, భార్యకు కూడా వయసు తెచ్చిన జబ్బులు, బి.పీ.లు, షుగర్లూ, వగైరా! పెద్దకుమార్తెకు పెళ్ళి చేశారు. కాని అల్లుడు తాగుబోతు కావడంతో కుమార్తెను ఇంటికి తెచ్చుకున్నారు మాస్టారు. కుమార్తెకు టైపు, షార్టు హేండ్‌లో చేర్చారు. ఆ అమ్మాయి కాన్వెంట్‌లో టీచర్‌గా చేస్తూ, సాయంత్రం టైపుకు వెళ్తున్నది. ఒక అబ్బాయి యాక్సిడెంట్‌లో కుంటివాడయ్యాడు. అయినా అతనిలో ఆత్మస్థైర్యం చెక్కు చెదరలేదు. మాస్టారు పెంపకం ఆ పిల్లలకు లక్షరూపాయల చెక్కుతో సమానమైనది. అతను చిన్న షాపు పెట్టుకుని, ఏడెనిమిది వందలు ఆర్జిస్తున్నాడు.

''జీవితంలో కష్టాలు,సుఖాలు సహజమైనవే! కష్టాలకు భయపడితే బ్రతుకే వ్యర్థం. కొలను మీద గాలి వీచకూడదూ,అసలు కదలకూడదూ, అంటే సమంజసమా? గాలి రాకడయెంత సహజమో, అలలు కదలడం కూడా అంతే సహజం. ఔనా?'' ఆయనను విస్ఫారిత నేత్రాలతో, భక్తిభావంతో చూస్తున్న నన్ను ప్రశ్నించారు మౌనంగా తలూపాను.

''కష్టాలకు క్రుంగిపోవడమంత అసంబద్ధత ఇంకోటి ఉండదు. అన్నిటికంటే జీవితం గొప్పది. అందులో సర్వజ్ఞతను సంతరించుకున్న మనిషిగా పుట్టడం మరింత గొప్ప వరం. జీవితంలో జీవించాలి ఎలాంటి సంఘటనలు ఎదురైనా, ''అయ్యో! ఇవి కష్టాలు, కష్టాలు వచ్చేశాయి, క్రమ్మేశాయి'' అంటూ ఏడవడం అంటే నాకు నచ్చదు.

జీవిత వేదిక విశాలమైనది. సరసమైన, సంతోషమైన నాట్యాన్నీ చేయాలి, అవసరమైతే తాండవ నృత్యాన్ని కూడా అదే నిజాయితితో చేయాలి. అలాంటి నాట్యాలను జీవిత వేదిక



సంతోషంతో స్వీకరిస్తుంది. ఏమంటావు?'' మాష్టారు అడిగారు.

ఏమంటాను? ఆయన ఇచ్చిన అమూల్యమైన ఆదర్శభావనతోపాటుగా, వకుళమాలను కూడా నా భార్యగా స్వీకరించాను.

ఆ తర్వాత నా ఇంట్లో అడుగుపెట్టాను ఇదివరకటి జుగుప్స, నిరుత్సాహం, నిర్వీర్యత

హేయమాభావంతో మాత్రం కాదు!!

నేను, వకుళ మా ఇద్దరి సంపాదనను జోడిస్తే, సంసారరథం ముందుకు సాగడం ఏమంత కష్టం కాదు.

ఇప్పుడు నాలో విశిష్ట ధ్యేయాలతో కొత్త వ్యక్తిత్వం మూర్తీభవించి ఉన్నది.

ఇంకోసారి ఏడుస్తూ వచ్చిన అక్కయ్యను బావగారి గొంతెమ్మ కోర్కెలను తీర్చి, మళ్ళీ వెనక్కి అత్తవారింటికి పంపలేదు. ఇక్కడే ఒక చిన్న ఉద్యోగంలో చేర్చి, నర్సు ట్రైనింగ్ కోర్సుకు అప్లై చేయించాను.

మమ్మల్ని ఇంతవరకూ వేధించిన సమస్యలు ఒక కొలిక్కి వచ్చేశాయి. అక్కయ్యను మళ్ళీ మేము వెనక్కి పంపించమని అర్థమవగానే, బావగారు గబగబా వచ్చేసి, గప్‌చుప్‌గా భార్యనూ కూతురినీ తీసుకుని వెళ్ళిపోయారు. ఆ తర్వాత కట్నాల కోసం, లాంఛనాల కోసం వారు మళ్ళీ వేదించలేదు.

అమ్మ ఆరోగ్యం నెమ్మదిగా కుదుట పడసాగింది.

రంగవేదికపై నవరసాలను అత్యంత సహజంగా ప్రదర్శింపగలిగేవాడే నిజమైన నాట్యాకళాకారుడు.

జీవితం అన్నిరకాల ఒడిదుడుకులనూ ''స్వాభావికమైనవి''గా స్వీకరించి, నిబ్బరంగా ముందుకు సాగగలిగేవాడే నిజమైన పరిపూర్ణమైన మనిషి. ●

### సెలవులమీద

బ్యాంక్ క్లరికల్ పోస్ట్‌కి ఇంటర్వ్యూ జరుగుతుంది.

అధికారి: ''బ్యాంక్‌లో మనం ఉద్యోగ నిర్వహణ చేస్తూ, పొరపాటున కానీ, కావాలని కానీ, మనమేదైనా తప్పుచేస్తే, దానివలన బ్యాంక్ నష్టపోతే మన మీద తీసుకునే చర్య ఏమిటి?

అభ్యర్థి: ''సెలవుల మీద పంపిస్తారు సార్.''

అధికారి: ''యు ఆర్ సెలెక్టెడ్''

### పట్టుచీర

''డాక్టర్ గారూ! నాకు కళ్ళు మంటలుగా ఉన్నాయండీ!''

''ఎప్పటి నుండమ్మా''

''మా పక్కింటి ఆవిడ పట్టుచీర కొన్నప్పటి నుండి''.

''ఆ!!''

పి.సీతారామిరెడ్డి

## అద్భుత ప్రపంచం

# ఐస్ యోధులు

భయంకరంగా ఘనీభవించిన ఐస్ వారి ప్రత్యర్థి. నీరు నిలవటానికి అవకాశం లేని మైనస్ పది డిగ్రీల వాతావరణం వారి యుద్ధస్థలం. ఇదేదో ఒక దేశస్థులు మరో దేశం వారితో యుద్ధం జరిపే రంగస్థలమేం కాదు. ఏఏటికాయేడు మరింతగా ఆదరణ, ప్రాచుర్యం పొందుతున్న ఆటకి రంగస్థలం.

'ఐస్ గ్లాడియేటర్స్ పోటీగా వ్యవహరించబడుతున్న యీ పోటీ ఏడాదికి ఒకసారి ఇటలీలోని కోర్టినా ఆఫ్ ఎంపజోలో జరుగుతుంది.

రాజుల పాలనలో గ్లాడియేటర్స్ ఉండేవాళ్ళు. ముఖమేకాక శరీరంలో చాలా వరకు ఇతర భాగాలు కూడా కనపడకుండా ఇనప కవచాలు ధరించి అమరణాంతం పోటీలో పాల్గొని రాజులకి వినోదం కూర్చేవాళ్ళు.

ఈ పోటీ కూడా ఇంచుమించు మరణ ఛాయల్లోనే జరుగుతుండటం వల్ల, అదే ధ్వని వచ్చే పేరు పెట్టినట్టున్నారు. చరిత్రలో కనుమరుగైపోయిన గ్లాడియేటర్ల వారైతే. ఆధునిక సమాజంలో కళ్ళముందు పోటీకి సిద్ధమవుతున్న గ్లాడియేటర్స్ వీరు.

పోతే వీళ్ళు పాల్గొనే పందెం మోటర్ సైకిళ్ళ పందెం. మరీ మామూలు రేస్‌ల్లాంటిది కాదు. ఎందుకంటే మంచులో పోటీ. 150 కిలో మీటర్ల స్పీడ్‌లో, చూపరులకి గగుర్పాటు కలిగించే మలుపులతో ఐస్‌ట్రాక్ మీద జరిగే యీ పోటీలోని మోటర్ సైకిళ్ళకి బ్రేకులు



వుండవు. ఎందుకంటే బ్రేకులు యీ మంచు దారి మీద నిరుపయోగం. చక్రాలకి అంగుళంన్నర పొడుగున మేకుల బెల్టు వుంటుంది. మంచు మీద యిదే పట్టు సాధించిపెట్టే పరికరం.

ప్రతి సంవత్సరం యీ పోటీలో ఒకరో యిద్దరో ప్రమాదానికి గురై చావటమో, చచ్చే దెబ్బలు తగిలి విరిగి ఏ పోటీకి పనికి రాకుండా తయారవటమో జరుగుతోంది. అయినా ఏ ఏటికాయేడు యీ పోటీలో పాల్గొనే ప్రత్యర్థుల సంఖ్యా, ప్రేక్షకుల సంఖ్యా గణనీయంగా పెరుగుతోంది. చావుతో పందెంలాంటి యీ పోటీల్లో రుచి ఏమిటో మరి.

మైనస్ పది డిగ్రీల చలిలో మోటార్ సైకిళ్ళు స్టార్ట్ అవటానికి మెకానిక్‌లు BLOW TORCHES తో ఇంజన్స్‌ని రెడీ చేస్తారు. ప్రమాద రక్షణకి గాను పోటీలో పాల్గొనే వారు శరీరం అంతా కవచాలు ధరిస్తారు. మలుపుల్లో పట్టు కోసం మోకాలి చిప్ప మీద మేకులు బెల్టులు, మంచు కళ్ళకి తాకకుండా గట్టి కళ్ళద్దాలు... ఇలా చూసేవాళ్ళకి, పాల్గొనే వాళ్ళకి ఆద్యంతం కష్టతరమైన యీ పోటీలంటే జనం ఎగబడటం వీటి రుచి తెలియని చాలా మందికి కలియుగ వింతలాగే వుంది.

– రావు.